# పరశురామ ప్రీతి



రేణుకా జమదగ్నుల పుత్రులు అయిదుగురిలో కడపటివాడు పరశురాముడు. ఇతనిలో క్షాత్రము బ్రాహ్మ్యము మూర్తీభవించియున్నవి. ఒకనాడు తల్లియగు రేణుక మానసిక వ్యభిచారమునకు గురియయ్యెనని కోపించి, జమదగ్ని తన కుమారులను రుమణ్వంతుని, సుషేవణుని, వసువును, విశ్వావసువును పిలిచి ఒక్కొక్కనితో తల్లిని వధింపుమని చెప్పెను. నల్వురును తల్లిని జంపజాలమనిరి. కుపితుడైన తండ్రి శాపముచే వారు తక్షణమే చనిపోయిరి. పిమ్మట అయిదవవాడగు పరశురాముని పిలిచి "ఓయీ! రామా! నీవైన దోషియగు నీతల్లిని నాయానగాజంపుము." అనెను. అతడు వెంటనే పోయి తల్లికి నమస్కరించి, ఒక్క వ్రేటున నఱికి వచ్చి కన్నీటితో తండ్రి యెదుట చేతులు కట్టుకొని నిలిచెను. జమదగ్ని అతని పితృ భక్తికి మెచ్చి, వరము కోరుకొమ్మనెను. పరశురాముడు "తండ్రీ! అమ్మను, అన్నలను బ్రతికించి యికముందు కోపము తగ్గించు-కొందునను వరమిమ్ము" అని కాళ్ళు పట్టుకొనెను. జమదగ్ని "ఓయీ! నీవు కోరినట్లే యగునుగాక. సర్వకాల సర్వావస్థలయందు నీకు జయము లభించుగాక" యనెను.

ఒకనాడు పరశురాముడు తాతయగు ఋచీకుని ఆశ్రమమునకును, వేఱొకనాడు భృగుమహర్షి(జమదగ్ని తాత) యాశ్రమమునకును బోయెను. వారి యుపదేశమును అనుసరించి, హిమగిరికేగి శివునిగూర్చి ఘోరతపము ఆచరించెను. శివుడు ప్రత్యక్షమై, "ఓయీ! ముందుగా తీర్థయాత్రలు చేసి రమ్ము" అనెను. పరశురాముడట్లే కావించిన పిదప శివుడు "రామా! నీవు ఈనాటి నుండి పరశురాముడవు. ఇంద్రనగరమున జరుగుచున్న దేవదానవ యుద్ధమున బాల్గొని దానవులను నిర్జింపుము. ఈ పరశువు నీకు సాయపడగలదు. నాయనుగ్రహము నీకున్నది. ఇది గ్రహించి పొమ్ము. జయము సాధింపుము" అనెను. రాముడు శివుని ఆజ్ఞను తలదాల్చి పోయి, దైత్యులను తఱిమికొట్టి దేవతలకు స్వర్గమును వశమొనర్చెను. శివుడు మెచ్చి భార్గవాస్త్రము కూడా ఇతనికి ప్రసాదించెను.

ఒకనాడు కార్తవీర్యుడను రాజు వేట నిమిత్తము పోవుచూ, జమదగ్ని ఆశ్రమమునకేగెను. తన వద్దనున్న కామధేనువు కారణముగా, జమదగ్ని రాజునకు, అతని సైనికులకు చక్కని ఆతిధ్యమిచ్చెను. అప్పుడు కార్తవీర్యుడు అత్యాసకేగి కామధేనువును తనకు సమర్పించమని, మహారాజైన అతనివద్దే అది ఉండడము సమంజసమని పల్కెను. జమదగ్ని అతని కోరికను తిరస్కరించెను. వెంటనే కార్తవీర్యుడు తన సైన్యమును పంపి, కామధేనువును బలిమితో తన నగరమునకు తోడ్కొనిపోయెను. పరశురాముడు ఈ విషయమును తెలుసుకుని, కార్తవీర్యుని రాజ్యమునకు పోయి, అడ్డువచ్చిన సైనికులను కడతేర్చి, చివరకు కార్తవీర్యుని నిర్జించెను. పిదప తన తండ్రి మరణమునకు కార్తవీర్యుని పుత్రులు శోకించి, అందుకు కారణమైన జమదగ్నిని, ధ్యానములో నుండగా, పరశురాముడు ఇంటలేని సమయములో హతమార్చి ప్రతీకారము గావించిరి

పరశురాముడొకనాడు తల్లి దండ్రులను జూడవలనను ఉత్కంటతో ఆందోళనగా నింటికిబోయెను. అప్పటికే హయహయుడను రాజుచే జంపబడిన తండ్రి దేహముపై తల్లి పడియేడ్చుచుండెను. తల్లి ఆ సమయమున ఇరువదియొక్క మార్లు గుండెబాదుకొని యేడ్చుచుండుట గమనించి తానును తండ్రిపాదాలపైబడి యేడ్చెను. తండ్రీ! నీవు నాకిచ్చిన వరము చేతనే నీయాగ్రహమును జంపుకొన్నావు. లేకున్న ఎట్టివారైన నీ కంటి మంటలచే క్షణములో భస్మము కాక యుందురా? నీ అకారణ మరణమునకు నాకిచ్చిన వరప్రదానమే కారణమైనది. నా తల్లి ఇరువదియొక్క మార్లు ఱొమ్ము బాదుకొని యేడ్చినది గాన ఇరువదియొక్క మార్లు క్షత్రియులపై దాడిచేసి వారిని నిర్వంశీయులనుగా జేసివైతునని శపథము పట్టెను. ఆ కోపావేశముతో పరశురాముడు నర్మదయందు స్నానమొనర్చి కార్తవీర్యుని నగరమునకేగెను. పోరున కార్తవీర్యుని పుత్రులను, వారి సేనలను, మత్స్యరాజును, నిషాదరాజులను, విధర్భరాజు సోమదత్తుని మిథిలాపతియను బృహద్బలుని, కన్యాకుబ్జ ప్రభువును, సౌరాష్ట్ర భూపతిని, అవంతీ వీరులను, సుచంద్రుడు మున్నగు రాజులను ఆగ్నేయాస్త్రముచే గాల్చివైచెను. ఇంతలో తల్లి సహగమనము చేసి తండ్రి శరీరముతో సహ దగ్ధురాలయ్యెనను దారుణ వార్త విని, కోపముతో కంట పడిన రాజపుత్రులనెల్ల సంహరించెను.

అప్పటికిని కోపమాగక తీవ్రమై ఆగ్నేయాస్త్ర ప్రయోగము చేసి కార్తవీర్యుని నగరమునంతను ప్రజలు హాహాకారములు చేయుచుండ మిన్నంటిన అగ్నిజ్వాలలలో ముంచి కాల్చివైచెను. అంతకును కోపము తీరక, ఇరువదియొక్క మారులు వెదకి క్షత్రియులనెల్ల సమూల నాశము గావించి కురుక్షేత్ర మందలి క్షత్రియుల రక్తపు మడుగులందు పితృ తర్పణములు గావించెను. కురుక్షేత్రమందలి 5 రక్తపు మడుగులకే శమంత పంచకమను పేరు గల్గెను. ఆగ్నేయాస్త్ర ప్రయోగమున కార్తవీర్యుని నగరము కాల్చివేసిన నాటినుండి గృహ దహనాదులకు పరశురామ ప్రీతి యను నానుడి ప్రసిద్ధికెక్కినది.

(సామెతకథలు పుస్తకము ఆధారముతో కూర్చబడినది. రచయిత శ్రీ ముసునూరి గణపతి శాస్త్రి గారికి కృతజ్ఞతలతో - సంపాదకులు.)